క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ధర్మపురి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళల్లో కళను వెలికితీయగానికే సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని నేరెళ్ల, గోవిందుపల్లె గ్రామాల్లో మంగళవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి భోగ శ్రావణి ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పలిగిరి వసుందర, బీజేపీ మండల అధ్యక్షుడు సంగెపు గంగారాం, నాయకులు తదితరులున్నారు.

భారత్ జోడో యాత్ర స్టిక్కర్ ఆవిష్కరణ

కోరుట్లరూరల్: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర స్టిక్కర్‌ను పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సందర్భంగా మంగళవారం స్టిక్కర్‌ను సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తదితరులు ఆవిష్కరించారు.

అడ్వకేట్ జనరల్‌ను కలిసిన రేచపల్లి వాసులు



అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో సర్పంచ్

సారంగాపూర్: రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఎడమల సుదర్శన్‌రెడ్డిని మంగళవారం మండలంలోని రేచపల్లి సర్పంచ్ ఎడమల జయ, గ్రామస్తులతో కలిశారు. సుదర్శన్‌రెడ్డి స్వస్థలం రేచపల్లి కావడంతో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామానికి రావాలని ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట గ్రామస్తులు ఉన్నారు.

కోటిలింగాలలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాల కోటేశ్వరస్వామిని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బీజేపీ శ్రేణులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే తన కుటుంబసభ్యులతో కలిసి గోదావరి నదిలో బోటింగ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్, బండారి రాజేందర్, సంగ వెంకటగిరి, గుమ్ముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: బహుజనులకు రాజ్యాధికారమే సాధించడమే బీఎస్పీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి అన్నారు. బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం జనకల్యాణ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ విరాళాలు సేకరించారు. బహుజన సామాజిక ఉద్యమాల కోసం ప్రజలు తమకు తోచినంత విరాళాలు ఇచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బత్తుల లక్ష్మణ్, సురేందర్, ప్రభాకర్, బాలరాజు, దేవేందర్, భాస్కర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై విప్ సమావేశం

ధర్మపురి: ఎస్సీల ఏబీసీడీల వర్గీకరణపై నేడు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నట్లు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం ఫోన్‌లో తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన ఎస్సీల వర్గీకరణ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం తరుపున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాదిని ఏర్పాటు విషయమై సోమవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ నేతృత్వంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తదితరులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు

జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్/మెట్‌పల్లి రూరల్/మల్లాపూర్/రాయికల్/ధర్మపురి/మల్యాల/పెగడపల్లి/గొల్లపల్లి/సారంగాపూర్/వెల్గటూర్: జిల్లా వ్యాప్తంగా మకర సంక్రాంతి, కనుమ వేడుకలు సోమ, మంగళవారాలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఇంటి వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి ఉత్సవాలు జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. డల్లాస్, న్యూయార్క్, వాషింగ్టన్‌తో పాటు, పలు ప్రాంతాల్లో తెలుగువారు ముగ్గుల పోటీలు, పతంగులు ఎగురవేయడం, పిండి వంటకాలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ధర్మపురి మండలం రాజారంలో మనోజ్ఞ, పెగడపల్లి మండలంమద్దులపల్లి గ్రామానికి చెందిన వెల్మ రమ్య, వెల్మ అనూష అనే మహిళలు తన ఇంటి కాంగ్రెస్ ఆరు గ్యారంటీల ముగ్గు వేశారు. సంబరాల్లో ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



జగిత్యాలలో బొమ్మల కొలువులో చిన్నారులు



రాయికల్ మండలం ఇటిక్యాలలో ముగ్గుల పోటీలు



మల్యాలలో ముగ్గుల పోటీల్లో యువతులు



పెగడపల్లి శివాలయంలో ..



జగిత్యాలలో పతంగులు ఎగరేస్తున్న చిన్నారులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్ సతీమణి



చిట్టాపూర్‌లో గంగిరెద్దుల విన్యాసం



ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్‌లో రామమందిరం ముగ్గు



జోగిన్‌పల్లిలో బహుమతులు అందిస్తున్న కృష్ణారావు



గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో బహుమతులు అందజేత

మోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి

గొల్లపల్లి: మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర ధర్మపురి నియోజకవర్గ అంబాసిడర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం అన్నారు. వికసిత భారత్ సంకల్ప్‌యాత్రలో భాగంగా మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ అన్నారు. పట్టణంలోని 10, 11 వార్డుల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్,పలువురు నాయకులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల, సిరికొండ గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి దివ్యశ్రీ, ఏపీవో రాజేందర్, సీసీ అంజయ్య, సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి అరుణ, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళకు విశేష స్పందన

బుగ్గారం: మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినఆరోగ్య మహిళ కార్యక్రమానికి చక్కటి స్పందన లభిస్తోంది. ప్రతీ మంగళవారం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేవలం మహిళల కోసమే ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతీ మంగళవారం సుమారు 90 నుంచి 100 మంది వరకు ఆయా పీహెచ్‌సీల పరిధిలోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ సంధర్భంగా నేరెళ్ల పీహెచ్‌సీ వైద్యురాలు డా.అవంతిక మాట్లాడుతూ మహిళలు నియమానుసారం వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన అనేక దీర్ఘకాలిక సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. నేరెళ్ల పీహెచ్‌సీలో మంగళవారం 68 మంది మహిళలు వైద్యపరీక్షలు చేయించుకున్నారని మెడికల్ ఆఫీసర్ డా.శివకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రాజేశం, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గురువుకు విద్యార్థుల ఆర్థికసాయం

ఇబ్రహీంపట్నం : మండలంలోని వర్షకొండలో మద్దెనపెల్లి శ్రీకాంత్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడికి పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. నాలుగేళ్లుగా ప్రాంకియాటీస్ అనే వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి రోజు ఇంజెక్షన్లు, మందులు అవసరం ఉండగా ఆర్థిక స్థోమత లేకపోవడంతో 2013,2014 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు మంగళవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. అతడికి భార్య, ఒక కూతురు ఉంది. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్,ఎంపీ ధర్మపురి అర్వింద్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తన బిడ్డకు వైద్య సహాయం అందించి ప్రాణాలు కాపాడాలని శ్రీకాంత్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఎవరైనా ఆర్థికసాయం చేయదలుచుకున్న దాతలు ఫోన్‌పే నంబర్ 9989002511 లేదా అకౌంట్ నంబర్ 358402010709485 నంబర్లకు పంపాలని తల్లిదండ్రులు వేడుకున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని 21వ వార్డులో మంగళవారం అయోధ్య శ్రీరాముని అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జైశ్రీరాం అని వాల్ పేయింటింగ్ వేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లిలో ఇంటింటికీ రాములోరి అక్షింతలను పంపిణీ చేశారు.అక్షింతలు తీసుకుని వచ్చిన వారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రవీణ్, మహేశ్, మురళి, స్వామి, శేఖర్ నవీన్, సతీశ్, మారుతి పాల్గొన్నారు.

భూపతిపూర్‌లో కాషాయజెండాలు అందజేత

రాయికల్: ఈనెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని భూపతిపూర్‌లో రామభక్తులు గోనె రాము–లక్ష్మి దంపతుల కుమారుడు అమరేశ్వర్ ఇంటింటికీ కాషాయ జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ అన్నవేని వేణు, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, నాయకులు బద్దం శ్రీనివాస్, కట్కం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భావాలు కలిగిన వ్యక్తి నిర్మాణమే ధ్యేయం

రాయికల్: జాతీయ భావాలు కలిగిన వ్యక్తి నిర్మాణమే ధ్యేయంగా సంఘం పనిచేస్తోందని ఆర్ఎస్ఎస్ జిల్లా సంచాలకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైతాపూర్‌లో మంగళవారం సంక్రాంతి ఉత్సవాలు, శాఖ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠతో దేశంలోని కోట్లాది మంది హిందువులు ఏళ్లుగా కన్న కల సాకారమవుతోందన్నారు.

గ్రామస్తులపై దాడిచేసిన వ్యక్తుల రిమాండ్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని ఆక్రమించగా అడ్డుకున్న వారిపై దాడి చేసిన వ్యక్తులను రిమాండ్ చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. నవంబర్‌లో తిమ్మాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోగా, అడ్డుకోవడానికి వెళ్లిన గ్రామస్తులపై దాడిచేసిన గుగ్లోత్ తిరుపతినాయక్, కడకుంట్ల నాగరాజు, గర్వందుల రమేశ్, ఇల్లెందుల సులోచన, ఎల్ల పోషన్న, ఎల్లాల బాలకృష్ణ, కుంచెపు శంకర్, పిట్టల హేమలత, రజియ సుల్తానాను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సీతారామాలయంలో చోరీ

కోరుట్లరూరల్: మండలంలోని ధర్మారం శ్రీ సీతారామాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ మండపంలో హుండీని ఎత్తుకెళ్లి అందులోని నగదును దోచుకుని హుండీని పక్కనే ఉన్న వాగులో వదిలేసి వెళ్లారు. ఆలయంలో గల ఇత్తడి గంటను కూడా దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కథలాపూర్: మండలంలోని సిరికొండలో రేషన్ దుకాణాలను మంగళవారం తహసీల్దార్ ముంతాజిబొద్దీన్ తనిఖీ చేశారు. ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీ ఏ విధంగా అందిస్తున్నారనే విషయాన్ని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బినామీ రేషన్ డీలర్లు ఉన్నారనే విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్ దుకాణాలు తనిఖీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ నాగేశ్, రేషన్ డీలర్లు జలందర్, గంగాధర్ ఉన్నారు.

నూతన చట్టాన్ని రద్దు చేయాలని ఆందోళన

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రమాద చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో మంగళవారం లారీ డ్రైవర్లు, క్లీనర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొత్త చట్టం వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సలీంఖాన్, వేణు, రవి, భాస్కర్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ధర్మపురి: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు భీమనాథి మంగ అశోక్ ఆధ్వర్యంలో గురుస్వాములు పెండ్యాల బాలకృష్ణశర్మ, రాజేష్‌శర్మల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలతో పడిపూజ నిర్వహించారు. శబరిమలైలో దర్శనమిచ్చిన మకర జ్యోతిని ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు చూసి తరించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులున్నారు.



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

శ్రీరాముల కల్యాణం, పట్టాభిషేకం కరపత్రాలు ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: శ్రీసీతారాముల కల్యాణం,పట్టాభిషేక మహోత్సవ కరపత్రాలను సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ధరూర్ క్యాంపు శ్రీకోదండరామాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ధరూర్ క్యాంపులోని కోదండ రామాలయ కల్యాణ మంటపంలో ఈనెల 22న శ్రీసీతారాముల కల్యాణం, పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, బల్దియా చైర్మన్ గోలి శ్రీనివాస్, జిట్టవేణి అరుణ్, కౌన్సిలర్ వొద్ది శ్రీలత, నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సంక్షిప్త వార్తలు

రివర్స్ మార్టిగేజ్ వృద్ధులకు వరం

జగిత్యాలటౌన్: పోషణ, ఆర్థిక అవసరాల కోసం రివర్స్ మార్టిగేజ్ వృద్ధులకు వరం లాంటిదని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వయోవృద్ధుల సంరక్షణ అవసరాల కోసం బ్యాంకుల నుంచి అప్పు పొందేందుకు రివర్స్ మార్టిగేజ్‌పై నూతన సభ్యులకు అవగాహన కల్పించారు. పిల్లల నిరాదరణకు గురైన వృద్ధులు తమను సంప్రదిస్తే వృద్ధుల ఆస్తులను రివర్స్ మార్టిగేజ్ చేయించి బతికున్నంత వరకు పోషణ ఖర్చులు పొందేలా ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గౌరిశెట్టి విశ్వనాథం, వేముల ప్రకాశ్, బొల్లం విజయ్‌కుమార్, పీసీ హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీలు అందజేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో వివేకానంద జయంతి, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎంపీటీసీ దెశెట్టి మమత రాజరెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌లు నిర్వహించారు. టోర్నమెంట్‌లో విజేతలకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సున్నం సత్యం, కొంపెల్లి మహేందర్‌రావు, పెంట లింబాద్రి, నాంపెల్లి వెంకటాద్రి, రాదారపు దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొక్కల బక్కవ్వ (70) అనారోగ్యంతో రెండు రోజుల క్రితం చెందింది. నిరుపేద కుటుంబ కావడంతో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేయాలని గ్రామానికి చెందిన అల్లకొండ భూమేశ్ వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టు చేయగా దాతలు ముందుకొచ్చి రూ. 30,300 నగదు జమ చేసి, 25 కిలోల బియ్యం అందజేశారు.

జైపాల్‌రెడ్డికి నివాళి

జగిత్యాల: కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని నెక్లెస్ రోడ్‌లోని స్ఫూర్తి స్థల్ సమాధి వద్ద ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కరీంనగర్ ఉమ్మడి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ ఘనంగా నివాళి అర్పించారు. పార్లమెంటీరియన్‌గా పేరు పొందిన వ్యక్తి అని పేర్కొన్నారు.

18న రాయికల్‌లో ఉచిత నేత్రవైద్య శిబిరం

రాయికల్: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18 న బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, కార్యదర్శి మోసాపు శ్రీకాంత్, కోశాధికారి గంట్యాల ప్రవీణ్ తెలిపారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో హాజరు కావాలని కోరారు.

భీమారంలో కబడ్డీ పోటీలు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని తెలంగాణ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు, మన్నెగూడెం సర్పంచ్ సింగిరెడ్డి నరేశ్ రెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కాచారం కబడ్డీ టీం మొదటి బహుమతి గెలుపొందగా, వెంకటరావుపేట టీం ద్వితీయ బహుమతి సాధించింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాయికల్: మండలంలోని తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011 –12 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాలలో చేసిన అల్లరిని గుర్తుచేసుకున్నారు.